సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం ၊ 19 ၊ ఫిబ్రవరి ၊ 2024



రాజన్న సేవలో సంగారెడ్డి ఎస్పీ

వేములవాడ: రాజన్నను ఆదివారం సంగారెడ్డి ఎస్పీ రూపేశ్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు ప్రసాదం అందజేసి సత్కరించారు.



సుల్తానాబాద్‌లో ఖోఖో..

కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఖోఖో, రాజన్న సిరిసిల్ల జిల్లాకు కబడ్డీ సెంటర్‌ను మంజూరు చేసింది.

8లో▸

గరిష్టం/కనిష్టం
35.0/21.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలంతా ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డీపీఆర్వోగా వంగరి శ్రీధర్

● మూడు రోజుల్లోనే డీపీఆర్వో మార్పు



వంగరి శ్రీధర్, డీపీఆర్వో

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా పౌరసంబంధాల అధికారిగా వంగరి శ్రీధర్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఎం.హన్మంతరావు ఆదేశాలు జారీ చేశారు. డీపీఆర్వోగా పని చేసిన మామిండ్ల దశరథం హైదరాబాద్‌కు బదిలీ కాగా.. ఆయన స్థానంలో అదనపు పౌర సంబంధాల అధికారిగా శారదను నియమించారు. కాగా, మూడురోజుల్లోనే ఆమెను మంచిర్యాలకు బదిలీ చేస్తూ.. ఆమె స్థానంలో జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా డీపీఆర్వోగా పని చేస్తున్న వంగరి శ్రీధర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. శారద సొంత ఊరు వేములవాడ మండలం హన్మాజీపేట కావడంతో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సొంత జిల్లాల్లో అధికారులు ఉండకూడదనే నిబంధన మేరకు ఆమెను మంచిర్యాలకు బదిలీ చేసి ఆమె స్థానంలో శ్రీధర్‌ను నియమించారు. డీపీఆర్వోగా శ్రీధర్ ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

విరిసిన నవ్వులు



నవ్వుల దినోత్సవంలో యోగా సాధకులు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో యోగా సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ఫన్ డే..ఫ్యామిలీ డే నిర్వహించారు. సీనియర్ యోగా సాధకుడు ఉప్పుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మానేరు వాగులో నిర్వహించారు. యోగా సాధకులు తమ కుటుంబ సభ్యులతో హాజరై సరదా సరదా ఆటలు..పాటలతో హుషారుగా గడిపారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, నవ్వుతో ఊపిరితిత్తులు, కండరాలకు శక్తి లభించడమే కాకుండా హార్మోన్స్ బ్యాలెన్స్ అవుతాయన్నారు. మానసిన ప్రశాంతత ఇచ్చిన కార్యక్రమంలో అందరూ కలిసి ఎంజాయ్ చేశారు.

ఆధ్యాత్మిక కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: భక్తులకు ప్రబోధించే ఆధ్యాత్మిక ప్రవచనాల కరపత్రాలను ఆదివారం సిరిసిల్ల బీవైనగర్ హనుమాన్ ఆలయంలో చిన్మయ మిషన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈనెల 27 నుంచి 29వరకు ఆలయంలో భగవద్గీత, ప్రషనోత్తర మణి రత్నమాల ప్రవచనాలు ఉంటాయని, భక్తులు పాల్గొనాలని కోరారు. కన్వీనర్ సజ్జనం శ్రీనివాస్, కోడం నారాయణ, జనపాల శంకరయ్య, మోతీలాల్, మేర్గు మల్లేశం, నల్ల సత్యనారాయణ, గజ్జెల్లి రామచంద్రం, సృజన, రాజమణి పాల్గొన్నారు.

తిమ్మాపూర్ విండో పాలకవర్గం క్షేత్ర పర్యటన



తోటలను పరిశీలిస్తున్న పాలకవర్గం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తిమ్మాపూర్ సింగిల్ విండో పాలకవర్గం స్టడీ టూర్‌కు తరలివెళ్లింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరి జిల్లా బీమడోలులో పామాయిల్ తోటలను ఆదివారం వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో డైరెక్టర్లు పరిశీలించారు. ఎల్లారెడ్డిపేట మండలంలో పామాయిల్ తోటల సాగుకు అనువైన వాతావరణం ఉన్నందున.. ఆంధ్రప్రదేశ్‌లో సాగు విధానాలను పరిశీలించామని వైస్ చైర్మన్ తెలిపారు. డైరెక్టర్లు లక్ష్మణ్, నారాయణ, సంతోష్‌రెడ్డి, సత్తిరెడ్డి, శ్రీరామ్, నరహరి, శ్రీనివాస్, కార్యదర్శి శివవర్ధన్, శ్రీకాంత్, సతీశ్ ఉన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండల కేంద్ర శివారులోని మొర్రాయిపల్లె పరిధిలో అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకుంటామని ఎంపీవో ఆరీఫ్ స్పష్టం చేశారు. ఏఎంఆర్ గార్డెన్స్ వెనకాల, కామారెడ్డి ప్రధాన రహదారిని ఆనుకొని ఓపెన్ స్థలంలో హద్దురాళ్లు పాతారని పేర్కొన్నారు. ఇట్టి ప్లాట్లకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు. ఎవరు వీటిని కొనుగోలు చేయరాదని అన్నారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శికి తగిన ఆదేశాలు జారీ చేశామన్నారు. రెండు రోజుల్లో దీనిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా మొర్రాయిపల్లె పరిధిలోని భూములు లేఅవుట్ అనుమతులు తీసుకోకుండానే ప్లాట్ల విక్రయాలు జరుపుతున్నారని పలువురు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

నీడ లేదు.. నీళ్లూ లేవు



చంటిపిల్లలను చంకలో ఎత్తుకుని ఎండలో బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న మహిళల అవస్థ ఇది. నిలువ నీడలేని స్థితిలో ఎర్రటి ఎండలో బస్సుకోసం వేచి చూస్తున్నారు. పిల్లలు, పెద్దలు, మహిళలు.. ఇలా అన్నివర్గాల ప్రయాణికులు సిరిసిల్ల పాత బస్టాండులో ఎదుర్కొనే కష్టాలివి. నిత్యం వేలాది మంది ప్రయాణికులకు నిలువ నీడ లేని దృశ్యాలు ఇక్కడ పరిపాటిగా మారింది. కనీసం చలువ పందిళ్లు వేయకుండా అధికారుల నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతోంది.



సిరిసిల్ల పాతబస్టాండ్‌లో బస్సుల కోసం ఎండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

- బస్టాండ్‌లో దాహం దాహం
- సిరిసిల్లలో ప్రయాణికుల కష్టాలు
- వాటర్ బాటిళ్లకు అధిక వసూళ్లు
- ప్లాట్‌ఫామ్‌ల వద్ద ఎండలో నిరీక్షణ
- మొదలైన ఎండాకాలం కష్టాలు..



సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్లకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి పోయే ప్రయాణికులకు గుక్కెడు మంచినీళ్లు అందివ్వాలన్న కనీస బాధ్యతను అధికారులు విస్మరించారు. అటు ఆర్టీసీ.. ఇటు మున్సిపల్ అధికారులు, పాలకులు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. 23 ఏళ్ల క్రితం పాతబస్టాండ్‌లో మున్సిపల్ వారు రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించారు. రోజు రోజుకు పెరుగుతున్న ప్రయాణికులతో సిరిసిల్ల డిపో కూడా వృద్ధి చెందింది. ప్రతినెలా రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా ప్ర యాణికులకు తాగునీటి ఏర్పాటుపై అశ్రద్ధ చేస్తున్నారు.

ప్ర'జల' కష్టాలివి..

- జిల్లా కేంద్రానికి 13 మండలాలతో పాటు హైదరాబాద్, ముంబాయి, భీవండి, షోలాపూర్, గుజరాత్, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి రోజూ వేలాది మంది ప్రయాణికులు, సందర్శకులు వచ్చి వెళ్తుంటారు.
- బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రం పూర్తిగా మూసేశారు. నిర్వాహకుల నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేమితో వాటర్ ప్లాంట్ పనికిరాకుండా పోయింది. ప్రయాణికులు గొంతు తడుపుకోవాలంటే రూ.10 వెచ్చించాల్సి వస్తోంది.
- ఎండాకాలం కావడంతో ప్రజల దాహార్తిని కొందరు వ్యాపారులు ఆసరా చేసుకుని అధిక రేట్లకు నాణ్యత లేని వాటర్ బాటిళ్లు అంటగడుతున్నారు.
- వివిధ రూట్లలో వెళ్లే ప్రయాణికులు ప్లాట్‌ఫామ్‌పై మండుటెండల్లో నిరీక్షించాల్సి వస్తుంది. గతంలో గ్రీన్‌నెట్స్ ఏర్పాటు చేయగా, ప్రస్తుతం ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.
- బస్టాండులో మెరుగైన వసతులు కల్పించాల్సి ఉండగా తమకేమి పట్టనట్లు అధికారుల ప్రవర్తన ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. అధిక రేట్లకు నీటి అమ్మకాలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- కాంగ్రెస్ సర్కారు ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో గతంలో కన్నా మూడురెట్లు ఎక్కువ మంది ప్రయాణికులు బస్టాండ్‌కు వస్తున్నారు. బస్సుల కోసం గంటల తరబడి ఎండలో వేచి చూసే సమయంలో నీడ, నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.



తాళం వేసి ఉన్న ఈ వాటర్ ప్లాంట్‌ను మాజీ మంత్రి కేటీఆర్ ఏడేళ్ల క్రితం రూ.3లక్షల నిధులతో ప్రారంభించారు. రాష్ట్రంలోనే మొదటగా ఉచితంగా సిరిసిల్ల పాతబస్టాండులో చల్లని నీటి ప్లాంటు ఏర్పాటు చేయించారు. తొలినాళ్లలో పారదర్శకంగా పనిచేసింది. తర్వాత అధికారుల నిర్లక్ష్యంతో మూతబడింది. దీంతో మండుటెండల్లో వేలాది మంది ప్రయాణికులు గొంతు తడుపుకునేందుకు అరిగోస పడుతున్నారు.

వాటర్‌ప్లాంట్ తెరిపించాలి



శుద్ధజలం వాటర్‌ప్లాంట్ రిపేరు చేయించి వినియోగంలోకి తీసుకురావాలి. బస్టాండులో నీళ్లు, వసతులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతుండ్రు. కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– సమ్మెట ప్రసాద్, ప్రయాణికుడు

ఇరుకు బస్టాండులో అవస్థలే..



పేరుకే సిరిసిల్ల జిల్లా కేంద్రం. బస్టాండు మాత్రం మారుమూల పల్లెకన్నా అధ్వానం. ప్రయాణికుల అవస్థలు పట్టించుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండుటెండల్లో నీడ కల్పించేలా గ్రీన్‌నెట్స్ ఏర్పాటు చేయాలి.

– వద్నాల శేఖర్‌బాబు

వ్యాపారుల దోపిడీ ఎక్కువైంది



బస్టాండులో వాటర్ బాటిళ్ల అమ్మకాల్లో వ్యాపారుల దోపిడీ ఎక్కువైంది. ఎమ్మార్పీ కన్నా ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారు. అన్‌బ్రాండెడ్ బాటిళ్లు, ప్యాకెట్స్ విక్రయిస్తున్నారు. పైసలుంటేనే మంచినీళ్లు కొనుక్కునే పరిస్థితిని చక్కదిద్దాలి.

– రౌతు ప్రణయ్, ఇంటర్ విద్యార్థి

నేతన్నల సంక్షేమాన్ని విస్మరించిన కేటీఆర్



మాట్లాడుతున్న రమేశ్

సిరిసిల్లటౌన్: నేతన్నల సంక్షేమాన్ని సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పూర్తిగా విస్మరించారని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ విమర్శించారు. ఆదివారం సిరిసిల్ల బీవైనగర్‌లోని పార్టీ ఆఫీస్‌లో మాట్లాడారు. అసెంబ్లీలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు బతుకమ్మ చీరలు, తదితర ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని ఎమ్మెల్యేగా కేటీఆర్ కోరలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రావాల్సిన రూ.260కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతోనే ప్రస్తుతం పరిశ్రమ సంక్షోభాన్ని చవిచూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో సిరిసిల్ల నియోజకవర్గం సమస్యలను లేవనెత్తలేదని, ఇక్కడి ప్రజల బాగోగులను పట్టించుకోకుండా ఎమ్మెల్యే పదవిలో ఉత్సవ విగ్రహంలా ఉంటున్నారని దుయ్యబట్టారు. వారానికి రెండ్రోజులు సిరిసిల్లలో ప్రజలకు అందుబాటులో ఉంటానన్న హామీని పూర్తిగా మరిచిపోయి ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా నా నియోజకవర్గంలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు కోడం రమణ, బెజుగం సురేశ్, గడ్డం రాజశేఖర్, మోర తిరుపతి, బింగి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరనున్న ఎంపీపీ..?

వేములవాడరూరల్: అధికార పార్టీలోకి క్రమంగా వలసలు పెరుగుతున్నాయి. ఇప్పటికే వేములవాడ మున్సిపల్ కౌన్సిలర్లు క్యూకట్టగా, మండల స్థాయి బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వేములవాడ పట్టణంతోపాటు రూరల్ మండలంలోని పలువురు ముఖ్య నాయకులు కూడా మరి కొద్ది రోజుల్లో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మండలంలోని చాలామంది బీఆర్‌ఎస్ నాయకులు కారు దిగి హస్తం గూటికి చేరేందుకు ముఖ్య నాయకులతో చర్చించినట్లు తెలిసింది.

ఆస్పత్రి సిబ్బందికి ఎన్‌క్వాస్ షీల్డ్



ఆస్పత్రి టీమ్‌కు ఎన్‌క్వాస్ షీల్డ్ అందిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆసుపత్రి కేంద్ర ప్రభుత్వం ద్వారా నేషనల్ క్వాలిటీ అసూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్) సర్టిఫికెట్ పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం కలెక్టరేట్‌లో వేములవాడ ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి ఎన్‌క్వాస్ షీల్డ్ అందజేశారు. వేములవాడ ఆసుపత్రిలోని ఫార్మసీ, ఓపీడీ, అడ్మిన్, రేడియాలజీ, ఎమర్జెన్సీ, ఐపీడీ, ఓటీ, ల్యాబ్, మెటర్నిటీ వార్డ్‌లలో అందిస్తున్న సేవలకు గాను ఎన్‌క్వాస్ సర్టిఫికేషన్, లేబర్ రూమ్ మెరుగైన నిర్వహణకు గాను లక్ష్య ప్రోగ్రాంలో భాగంగా సర్టిఫికేషన్, పిడియాట్రిక్ విభాగంలో ఉత్తమ వైద్య సేవలు అందించినందుకు గాను ముస్కాన్ సర్టిఫికేషన్ వరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అవార్డు మీ బాధ్యతను మరింత పెంచిందని, ఇదే స్ఫూర్తితో ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన, అత్యుత్తమ వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రేగులపాటి మహేశ్ రావు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రజిత, ఆఫీసు సూపరింటెండెంట్ నాగరాజు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే మిడ్‌మానేరు పనులు



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: మిడ్‌మానేరు ప్రాజెక్టు పనులు నూటిలో 80శాతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే జరిగాయని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన నివాసంలో మాట్లాడారు. తెలంగాణను సస్యశ్యామలం చేశామని బీఆర్‌ఎస్ పార్టీ జబ్బలు చరుచుకోవడం హాస్యాస్పదమన్నారు. నీటి పారుదలను పూర్తిగా ఛిన్నాభిన్నం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 9,10,11,12వ ప్యాకేజీల పనులు ముందుకు సాగకపోవడంతో సిరిసిల్ల నియోజకవర్గ రైతాంగానికి నీరు అందక అల్లాడుతున్నారన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీళ్లు తరలించే పనులు మాత్రమే పూర్తి చేసి, ప్రజానీకానికి మాత్రం కాళేశ్వరం ద్వారా లక్షలాది ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ నిర్లక్ష్యంతోనే సిరిసిల్ల పట్టణం తరుచూ వరదలకు గురవుతుందని పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా కేటీఆర్‌ను సిరిసిల్ల ప్రజలు గెలిపిస్తే..పదృశాలీలు, రైతన్నలను నట్టేటా ముంచారన్నారు. ఇప్పటికైనా బుకాయింపులు మానుకుని ప్రజాక్షేమానికి పాటుపడాలని లేకుంటే సరైన రీతిలో బుద్ధిచెబుతామన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, ఆకునూరి బాలరాజు, కాముని వనిత, వెల్ముల స్వరూప, సూర దేవరాజు, వైద్య శివప్రాసాద్, యెల్లె లక్ష్మీనారాయణ, కోడం అమర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ చేరిన గోదావరి



గోదావరి జలాలతో నిండిన లింగంకుంట చెరువు

ముస్తాబాద్(సిరిసిల్ల): గోదావరి జలాలు ముస్తాబాద్‌కు చేరాయి. యాసంగి పంటలకు నీరందించాలన్న రైతుల విజ్ఞప్తి మేరకు కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి గోదావరి జలాల విడుదలపై చర్చించారు. ఈమేరకు మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను కెనాల్ ద్వారా వదిలారు. ఇప్పటికే ముస్తాబాద్ మండలం చీకోడు, మద్దికుంట చెరువులు నిండాయి. మద్దికుంట చెరువు మత్తడి పోయగా, అక్కడి నుంచి ముస్తాబాద్ లింగంకుంటకు చేరాయి. మల్లన్నసాగర్ నీటితో లింగంకుంట పూర్తిగా నిండింది. దీని మత్తడి నీరు ముస్తాబాద్ పెద్ద చెరువుకు చేరుతుంది. దీని ద్వారా భూగర్భ జలాలకు ఢోకా లేదని ముస్తాబాద్ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాజక్కపేట చెరువు కూడా నిండడంతో అక్కడి నుంచి ముస్తాబాద్ పెద్ద చెరువుకు నీరు రావడం మొదలైంది.

పోరాటయోధుడు గుమ్మి పుల్లయ్య

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పుల్లయ్య స్మారక స్తూపం ఆవిష్కరిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, సీపీఐ నేత వెంకట్‌రెడ్డి తదితరులు

వేములవాడ: తెలంగాణ సాయుధ పోరాటంలో తుపాకీ చేతబట్టి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుడు గుమ్మి పుల్లయ్య అని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. వేములవాడ పట్టణం మూలవాగు ఒడ్డున పుల్లయ్య స్మారక స్తూపం ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. సాయుధ పోరాటంలో తనదైన పోరాటం చేసి పీడిత ప్రజలకు అండగా నిలిచారని, ఇలాంటి కార్మిక నాయకుడి స్తూపాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. పేదల హక్కుల కోసం, అణగారిన వర్గాల కోసం పుల్లయ్య పోరాటం చేస్తే.. ఆయన కుమారులు సామాజిక దృక్పథంతో కరోనా సమయంలో చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి తెల్ల దేవరాజు, నాయకులు కడారి రాములు, గాజుల పోచెట్టి, శీలం నర్సయ్య, పంతం రవి, కాంగ్రెస్ నాయకులు కూరగాయల కొమురయ్య, సాగారం వెంకటస్వామి, సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, పాత సత్యలక్ష్మి, గుమ్మి పుల్లయ్య కుమారులు పవన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయ్యేదెవరో..?

- రాత్రికిరాత్రే పోస్టింగ్ ఉత్తర్వులు
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొందరు
- పనిలో నైపుణ్యం కొరవడి ఇంకొందరు
- పోలీసు శాఖలో వరుస బదిలీలు
- ఆర్టీఏ శాఖలోనూ ఇదే తీరు..



ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విధుల్లో చేరిన ఎస్బీ డీఎస్పీ మహేశ్‌బాబు

సిరిసిల్లక్రైం: పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తుందన్న నెపంతో జిల్లాలోని పలువురు పోలీసు, ఆర్టీఏ అధికారులు బదిలీ అవుతున్నారు. బదిలీ అవుతున్న వారిలో కొందరు సుదీర్ఘకాలం పని చేసినవారున్నారు. మరికొందరు ఇటీవలే విధుల్లో చేరి బదిలీ అవుతుండడంతో వారి పని తీరును సంబంధిత శాఖ అధికారులు పరిశీలించి, నివేదికను ఉన్నతాధికారులకు పంపి బదిలీ వేటు వేసేందుకు కృషి చేసినట్లు జిల్లాలో జోరుగా చర్చ జరుగుతోంది. జిల్లాలోని తంగళ్లపల్లి, చందుర్తి, ఇల్లంతకుంట, వీర్నపల్లి ఠాణాల అధికారులు బదిలీ అయిన విషయం తెలిసిందే.

పోలీసుశాఖలో మొదలై..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసుశాఖలో సిరిసిల్ల డీఎస్పీతోపాటు పలువురు సీఐలు, ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. కాగా, అనూహ్యంగా అప్పటి వరకు అధికారంలో ఉన్న పార్టీ ఓటమి పాలై కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరింది. పోలీసు అధికారుల పోస్టింగ్స్‌లో రాజకీయ ప్రమేయం ఉండదని స్వయంగా సీఎం ప్రకటించారు. దీంతో ఇక జిల్లాలోని పోలీసు ఉన్నతాధికారి సంబంధిత అధికారుల పనితీరును పరిశీలించి ఎస్‌ఐలను బదిలీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. తాను బదిలీ చేయడానికి వీలులేని వారిపై నివేదికలను ఉన్నతాధికారులకు అందించి పని చేసేవారికి పట్టం కడుతున్నట్లు అభిప్రాయాలున్నాయి. పని విషయంలో అధికారి కచ్చితత్వంతో పరుగులు పెట్టిస్తున్నారని, ఇక్కడ పని చేయాలంటే ఓపిక, జవాబుదారితనం కావాలన్న దానితో విధుల్లో చేరేందుకు అధికారులు జంకుతున్నట్లు అంతర్గత చర్చ జరుగుతోంది.

అంతర్గత విభేదాలు.. ఆర్థిక లావాదేవీలు..

కొందరు అధికారులకు సంబంధిత డివిజన్‌లోని కిందిస్థాయి అధికారులకు అంతర్గత విభేదాలు ఏర్పడి అది కాస్త పైస్థాయి అధికారులకు చేరినట్లు తెలిసింది. దీనిలో భాగంగా జిల్లాలో ఇద్దరు ఎస్‌ఐలు, ఓ సీఐ స్థాయి అధికారుల మార్పు అనివార్యంగా మారింది. కాగా వీరందరినీ సమన్వయం చేయాల్సిన అధికారి కూడా సర్దుబాటులో విఫలమైనట్లు, దానిపై ఇప్పటికీ నిఘా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మరో డివిజన్‌లో ఆర్థిక లావాదేవీలు జరిపే ఓ సీఐ స్థాయి అధికారి ఏకంగా అతని పై అధికారి హుకుం చేసి మరి మద్యం దుకాణాల నుంచి డబ్బులు వసూలు చేయించినట్లు జిల్లాలో జోరుగా చర్చ జరిగింది. ఇదే సమయంలో సంబంధిత సీఐ ఎన్నికల కోడ్‌తోపాటు సుదీర్ఘ కాలం పనిచేసిన విషయమై బదిలీపై వెళ్లారు. అనంతరం ఆర్థికలావాదేవీలు చేస్తున్న అధికారిని పొమ్మనలేక పొగబెట్టినట్లు కావడంతో ఇటీవల కొన్నాళ్లు సెలవులో వెళ్లారు. అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ సంబంధిత అధికారి కూడా బదిలీపై వెళ్లారు. అధికారి స్థాయిలో ఉన్నవారు ఆమ్యామ్యాల విషయంలో పోస్టింగ్ వదులుకునే పరిస్థితి రావడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వరుస చోరీలు.. హత్యలు.. గంజాయి..

జిల్లాలో గంజాయి, చోరీలు, హత్యల నియంత్రణకు ప్రతి సమీక్షలో అధికారులకు ఉన్నతాధికారి ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తున్నారు. కానీ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారనే అభిప్రాయాలున్నాయి. ఒకప్పుడు ఒక డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో నడిచిన జిల్లాలో ఇప్పుడు డీఎస్పీలు, సీఐలు పదుల సంఖ్యలో ఉన్నా శాంతిభద్రతల విషయంలో కాస్త వెనుకంజలో ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారు. దీనిని చక్కబెట్టేందుకు జిల్లా పోలీసు ఉన్నతాధికారి యాంటీ డ్రగ్ క్లబ్స్, బ్లూకోల్ట్స్ విధానం, మెసేజ్ యువర్ ఎస్పీ, గ్రీవెన్స్ డే, ఠాణా దివస్, మొబైల్ ఠాణా వంటి విధానాలతో ముందుకెళ్లి శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నారు.

సిరిసిల్ల డీఎస్పీ బదిలీ



ఉదయ్‌రెడ్డి

సిరిసిల్లక్రైం: పోలీసుశాఖలో బదిలీలు కొనసాగుతున్నాయి. సిరిసిల్ల డీఎస్పీగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో విధుల్లో చేరిన ఉదయ్‌రెడ్డిని బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ రవికుమార్ గుప్తా ఉత్తర్వులు వెల్లడించారు. అలాగే సిరిసిల్లకు భీమశర్మను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఆర్టీఏలోనూ బదిలీల పర్వం

సిరిసిల్ల జిల్లాగా ఏర్పడిన అనంతరం రవాణాశాఖ అధికారిగా వచ్చిన వై.కొండల్ రావు ఇటీవల బదిలీ పై వెళ్లారు. అలాగే ఎంవీఐగా విధులు నిర్వహిస్తున్న చంద్రకిశోర్‌రెడ్డి బదిలీ అయ్యారు. వీరిద్దరూ సుదీర్ఘ కాలం పనిచేయడంతో పార్లమెంట్ ఎన్నికల కోడ్ రానున్న తరుణంలో బదిలీ వేటు పడినట్లు సమాచారం. జిల్లాలోనే కాదు రాష్ట్రంలోని ఆర్టీఏ విభాగంలోని అధికారులందరినీ కొత్త ప్రభుత్వం మార్పుల చేసినట్లు సీనియర్ అధికారి తెలిపారు.

అధికారి స్థాయి	వచ్చినవారు	వెళ్లినవారు
సిరిసిల్ల డీఎస్పీ	భీంశర్మ	ఉదయ్‌రెడ్డి
సిరిసిల్ల ఎస్బీడీఎస్పీ	మహేశ్‌బాబు	రవికుమార్
సిరిసిల్ల టౌన్ సీఐ	రఘుపతి	ఉపేందర్
వేములవాడరూరల్ సీఐ	శ్రీనివాస్	కృష్ణకుమార్

క్లుప్తంగా

ముత్యంపేట పోచమ్మ ఆలయంలో చోరీ


గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టిన హుండీ

మల్యాల(చొప్పదండి): మండలంలోని ముత్యంపేట పోచమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని హుండీని పగులగొట్టి, భక్తులు హుండీలో వేసిన నగదు, ఆభరణాలను ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని సమాచారం. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు హుండీ పగులగొట్టి ఉండడాన్ని గమనించి వీడీసీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం


సహాయక చర్యల్లో గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఒకరి ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బద్దం గంగారెడ్డి ఇంట్లో ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. గ్రామస్తులు గమనించి నీళ్లు చల్లి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఇంట్లోని వస్తువులు, పైకప్పు పూర్తిగా కాలిపోయింది. చివరకు ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పేసింది. ఘటనలో సుమారు రూ.5లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు, అధికారులు పేర్కొన్నారు.

కుక్కలదాడిలో 28 గొర్రెపిల్లల మృతి


గొర్రె పిల్లలు

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామానికి చెందిన అత్తెన మల్లేశంకు చెందిన గొర్రెల మందపై ఆదివారం వేకువజామున కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 28 గొర్రెపిల్లలు మృతిచెందాయి. గొర్రెల కాపరి కేకలు వేయడంతో స్థానికులు కుక్కలను తరిమివేశారు. బాధితుడికి ప్రభుత్వం పరిహారం అందించాలని స్థానికులు కోరారు. అలాగే కుక్కల బెడదను అరికట్టాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


పెరుగు శేఖర్(ఫైల్)

మల్యాల(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతిచెందాడు. మల్యాల మండలం గొల్లపల్లె గ్రామానికి చెందిన పెరుగు శేఖర్ (27) బైక్‌పై జగిత్యాల వెళ్తుండగా.. మద్దుట్ల గ్రామానికి చెందిన వంగల శివ జగిత్యాల నుంచి మద్దుట్లకు వస్తూ శనివారం రాత్రి రాజారం గ్రామం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో శివ కాలు, చేయి విరిగింది. శేఖర్ తలకు తీవ్రంగా గాయం కావడంతో కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ శేఖర్ ఆదివారం మృతిచెందడంతో గొల్లపల్లిలో విషాదం నెలకొంది.

సుల్తానాబాద్‌లో ఖోఖో.. సిరిసిల్లలో కబడ్డీ

- ఉమ్మడి జిల్లాకు ఖేలో ఇండియా సెంటర్లు మంజూరు
- ఇప్పటికే కరీంనగర్‌లో జూడో సెంటర్
- క్షేత్రస్థాయిలో క్రీడాభివృద్ధికి దోహదం
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాభిమానులు



సుల్తానాబాద్‌లో ఖేలో ఇండియా ఖోఖో సెంటర్‌కు మంజూరైన క్రీడాప్రాంగణం

కరీంనగర్‌స్పోర్ట్స్: క్రీడల్లో ఇండియాను నంబర్‌వన్‌గా నిలిపేందుకు కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ ఖేలో ఇండియా సెంటర్లు ఏర్పాట్లు చేస్తోంది. దేశవ్యాప్తంగా జిల్లాకో క్రీడా సెంటర్ మంజూరు చేస్తోంది. గతంలో కరీంనగర్ జిల్లాకు జూడోలో ఖేలో ఇండియా సెంటర్ మంజూరు చేయగా.. తాజా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఖోఖో, రాజన్న సిరిసిల్ల జిల్లాకు కబడ్డీ సెంటర్‌ను మంజూరు చేసింది. దీంతో ఆయా జిల్లాలోని క్రీడలు క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరిగేందుకు అవకాశం ఏర్పడింది. దీంతో నైపుణ్యంగల క్రీడాకారులకు సువర్ణ అవకాశం కల్పించినట్లయ్యింది.

ఖోఖో ఖిల్లా.. సుల్తానాబాద్

తెలంగాణలో ఖోఖో ఖిల్లాగా పేరుగాంచిన సుల్తానాబాద్‌లో ఖోఖోక్రీడలో ఖేలో ఇండియా సెంటర్ మంజూరుకావడం విశేషం. ఇక్కడి క్రీడాకారులు 75మందికి పైగా జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొన్నవారే. పలువురు క్రీడాకారులు జాతీయస్థాయిలో బంగారు, రజత, కాంస్య పతకాలు సైతం సాధించారు. ఇదే ప్రాంతానికి చెందిన గెల్లు మధుకర్ యాదవ్ రెండుసార్లు భారత ఖోఖో జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం మంజూరైన ఖేలో ఇండియా ఖోఖో సెంటర్‌కు కోచ్‌గా నియామకమయ్యారు. నేడు సుల్తానాబాద్‌లోని మార్కండేయాకాలనీలోని తెలంగాణ గ్రామీణ క్రీడాప్రాంగణంలో సెంటర్ ప్రారంభం కానుంది.

కబడ్డీ కంచుకోటలో

ఉమ్మడి జిల్లాలో కబడ్డీకి కంచుకోటగా పిలిచే నూకలమర్రి, చెక్కపల్లి ప్రాంతాలు రాజన్న సిరిసిల్ల జిల్లాలోనివే. తమ జిల్లాకు కబడ్డీ ఖేలో ఇండియా సెంటర్ మంజూరు కావడంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. రెండు ప్రాంతాల నుంచి సుమరు వందల సంఖ్యలో క్రీడాకారులు జాతీయస్థాయిలో సత్తాచాటారు. ప్రస్తుతం మంజూరైన ఖేలో ఇండియా కబడ్డీ సెంటర్ రాజీవ్‌నగర్‌లోని మినీ స్టేడియంలో త్వరలో ప్రారంభం కానుంది. జిల్లాస్థాయిల్లో ఖేలో ఇండియా సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ నిర్ణయించడంపై జిల్లాలోని క్రీడాభిమానులు, క్రీడాసంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంచి రోజులు



జిల్లాల్లో ఖేలో ఇండియా సెంటర్లు ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం. క్షేత్రస్థాయిలో క్రీడాభివృద్ధి జరుగుతుంది. క్రీడాకారులుగా ఎదుగాలనే వారికి ఖేలో ఇండియా సెంటర్లు దిక్సూచిగా పనిచేస్తాయి. కబడ్డీ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

– అజ్మీరా రామదాసు, డీవైఎస్‌వో రాజన్న సిరిసిల్ల

గ్రామీణులకు అవకాశం



జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న ఖేలో ఇండియా సెంటర్లతో గ్రామీణ క్రీడాకారులకు అవకాశాలు లభిస్తాయి. సెంటర్లలో మెరుగైన శిక్షణ లభిస్తుంది. ఉన్నతమైన ప్రమాణాలు, శిక్షకులతో ప్రతీరోజు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయి. తద్వారా నైపుణ్యంగల క్రీడాకారులుగా ఎదగవచ్చు.

– సురేశ్, డీవైఎస్‌వో పెద్దపల్లి

అద్భుతమైన శిక్షణ ఇస్తా



రెండుసార్లు భారత జట్టుకు ఆడిన. సుమారు 60కి పైగా జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్న అనుభవం ఉంది. దీంతో ఖేలో ఇండియా ఖోఖో సెంటర్‌లో శిక్షణపొందే క్రీడాకారులకు అద్భుతమైన శిక్షణ అందిస్తా. సుల్తానాబాద్ ఖోఖో చరిత్రకు పూర్వవైభవం తీసుకొస్తా. ఆసక్తి గల క్రీడాకారులు దరఖాస్తులు చేసుకోవాలి.

– గెల్లు మధుకర్ యాదవ్, కోచ్, సుల్తానాబాద్

పూర్వవైభవం



ఖోఖోకు కేరాఫ్ అడ్రస్ సుల్తానాబాద్. అలాంటి సుల్తానాబాద్‌కు ఖేలో ఇండియా సెంటర్ రావడం సంతోషకరమైన విషయం. సుల్తానాబాద్ ఖోఖోకు పూర్వవైభవం రానుంది. సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ పక్షాన అన్ని రకాల సాయం అందిస్తాం. ఖేలో ఇండియా సెంటర్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

– ముస్త్యాల రవీందర్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు

బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలకు స్పందన


బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న సంఘం ప్రతినిధులు

కరీంనగర్‌స్పోర్ట్స్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలకు స్పందన వచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 40మంది క్రీడాకారులు హాజరయ్యారు. విశేష ప్రతిభ కనబరిచిన గుర్రాల హరిహర, జి.శివకృష్ణ, కె.రాజు, డి.వర్షిత్ కుమార్, ఈ.లక్ష్మీలీల, గుర్రాల హరిణి, శ్రీ.ఠాకూర్ తేజస్విని, పవన్, ఆర్.బాలరాజ్, ఓ.అక్షయ్ కార్తీక్, పెండం కావ్య శ్రీ,, దామరిచి రచన, వేల్పుల అక్షిత, ఆర్.కల్యాణి, కె.అక్షరను ఈ నెల 21,22 తేదీల్లో సికింద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి.సత్యనారాయణ, కొత్తకొండ సంపత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.మురళి, ఎం.శ్రీకాంత్, పృథ్వీరాజ్, గోల్కొండ శ్రీరామ్, కుమార్‌స్వామి, రఘువీర్‌సింగ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా హ్యాండ్‌బాల్ పోటీలు


సెమీఫైనల్‌లో ప్రవేశించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టుతో ఏసీపీ ప్రతాప్

- పురుషుల సెమీస్‌లో కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్
- మహిళల సెమీఫైనల్‌లో హైదరాబాద్, వరంగల్ జిల్లాల జట్లు
- నేటితో ముగియనున్న రాష్ట్రస్థాయి పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ రేకుర్తిలోని లయోలా కళాశాల ఆవరణలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ హ్యాండ్‌బాల్ పోటీలు చివరిదశకు చేరుకున్నాయి. పురుషుల విభాగంలో ఆతిథ్య కరీంనగర్‌తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లా జట్లు, మహిళల విభాగంలో హైదరాబాద్, వరంగల్ జిల్లాల జట్లు సెమీఫైనల్‌లో ప్రవేశించాయి. నేడు సెమీఫైనల్, ఫైనల్ పోటీలు జరుగుతాయని, సాయంత్రం విజేతలకు బహుమతి ప్రదానం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్లు సత్తాచాటి పతకాలు సాధించాలని ఏసీపీ సి.ప్రతాప్ సూచించారు. ఆదివారం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని రెండోరోజు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందుతుందని అన్నారు. క్రీడా కోటాతో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రజనీకాంత్, తెలంగాణ హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, రాష్ట్ర, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం బాధ్యులు, పీడీలు, పీఈటీలు బసరవేణి లక్ష్మణ్, ప్రభాకర్, మూల వెంకటేశ్, వేల్పుల సురేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చింతకాయల కోసం చెట్టు ఎక్కి..

- చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

ధర్మారం(ధర్మపురి): నందిమేడారం గ్రామానికి చెందిన పీసు రఘునందన్‌రెడ్డి (65) ప్రమాదవశాత్తు ఆదివారం ఉదయం చింతచెట్టు పైనుంచి పడి మరణించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఇంటి సమీపంలోని చింతచెట్టుపైకి ఎక్కి చింతకాయలు తెంపుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి రాళ్లగోడపై పడ్డాడు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోని చొప్పదండి వద్ద మరణించాడు. మృతుడి కుమారుడు దేవేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందతూ వ్యక్తి మృతి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగిరి మండలం చందనాపూర్ గ్రామానికి చెందిన మేకల రవి(35) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తన భార్య కొన్నిరోజుల నుంచి కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురైన రవి.. శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి సోదరుడు మేకల కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


రాజు (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఓ వ్యక్తి అనారోగ్యంతో మనస్తాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ సారంపల్లి ప్లాట్స్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా అంబారీపేటకు చెందిన గుండం రాజు (32) మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్నాడు. ఉపాధి కోసంరెండేళ్లక్రితం గల్ఫ్ వెళ్లి అనారోగ్యంతో 7 నెలలక్రితం తిరిగి వచ్చాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఏపని చేయలేక తనలో తానే మదనపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఆది వారం వేకువజామున ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, తండ్రి ఉన్నారు. తంగళ్లపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు

మల్యాల(చొప్పదండి): అజాగ్రత్తగా, అతివేగంగా కారు నడిపి, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. మల్యాల ఎస్సై కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలం అప్పారావుపేటకు చెందిన గరిగంటి శ్రీనివాస్ జగిత్యాలకు వెళ్లి, తిరుగు ప్రయాణంలో మల్యాల మండలం ముత్యంపేట శివారులోని టౌన్‌షిప్ సమీపంలో శనివారం గోనె వందన్‌కుమార్ తన కారును అజాగ్రత్తగా.. అతివేగంగా నడిపి, బైక్‌కు ఢీకొనడంతో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

- ఒకరి తీవ్ర.. ఇద్దరికి స్వల్పగాయాలు


అదుపుతప్పి పంటపొలాల సమీపంలో పడిన కారు

సిరిసిల్లక్రైం: ముస్తాబాద్ నుంచి వేములవాడ వైపు సిరిసిల్ల రెండో బైపాస్ మీదుగా వస్తున్న కారు అతివేగంతో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. స్థానికుల వివరాల ప్రకారం.. అతివేగంతో వస్తున్న కారు పెద్దూరు శివారులోని అపరల్ పార్క్ సమీపంలో అదుపుతప్పి ఒక్కసారిగా రోడ్డు కిందకు దూసుకెళ్లింది. కారులో ఉన్నవారు అరవడంతో స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగ్రాతులను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న ప్రవీణ్‌కు తీవ్రగాయాలు కాగా, మెరుగైన వైద్యం కోసం సిద్ధిపేట తరలించారు. మరో ఇద్దరికి స్వల్పగాయాలైనాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని సుద్దాల గ్రామ సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలు.. కనగర్తి గ్రామానికి చెందిన వేణు వేములవాడలో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా సుద్దాల సబ్‌స్టేషన్ వద్ద గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో వేణుకు తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వేములవాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న బీజేపీ

- మతతత్వ విధానాలతోనే పేదరికం
- రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి
- ఉపాధి కార్మికులకు రూ.600 చెల్లించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిరిసిల్లలో నిర్వహించిన ఉపాధిహామీ కార్మికుల జిల్లాస్థాయి సదస్సులో మాట్లాడారు. పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలు చేయడంతోనే దేశంలో పేదరికం పెరిగిపోతోందన్నారు. కో–ఆపరేటివ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ.. కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను మోదీ సర్కారు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించి, చనిపోయిన 700 రైతుల కుటుంబాలకు పరిహారం అందివ్వాలని, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో అత్యధికంగా నిధులు కేటాయించాలని, గ్రామాల్లో పనిచేసే కార్మికులకు పనిముట్లు ప్రభుత్వమే అందించి, 15రోజులకు ఒకసారి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్కో కార్మికునికి రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలన్నారు. కార్మికుల, కర్షకుల సంక్షేమం కోసం బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ పోరాటాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఎం బాల మల్లేశ్, కడారి రాములు, జంగం అంజన్న, అజ్జ వేణు, మీస లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కథలాపూర్: కథలాపూర్ మండలం కలిగోట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబారిపేట గ్రామానికి చెందిన శీలం శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ కలిగోట శివారులోని సత్యనారాయణస్వామి దేవాలయం వద్ద శనివారం రాత్రి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి కుమారుడు సిద్ధయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

కారు, ఆటో ఢీ: ఇద్దరికి గాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపెల్లి శివారులో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై ఆదివారం కారు, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. తక్కళ్లపెల్లికి చెందిన నారుపాక అరుణ, మల్లవ్వ పనినిమిత్తం ఆటోలో జగిత్యాల వస్తున్నారు. ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డు దాటుతుండగా.. అదే సమయంలో ఓ కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న అరుణ, మల్లవ్వకు తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

18 ఏళ్ల నిరీక్షణకు మోక్షం

- దుబాయ్ జైలు నుంచి విడుదలై ఇంటికి చేరిన మానాల వాసి
- కేటీఆర్ కడుపు సల్లగుండాలి: హనుమంతు భార్య పద్మ


పద్దెనిమిదేళ్ల అనంతరం భర్త హనుమంతుతో భార్య పద్మ, కూతురు గౌతమి

మల్యాల(చొప్పదండి): పెళ్లైన ఏడాదికే ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి.. అక్కడ హత్యకేసులో ఇరుక్కుని జైలుకెళ్లి 18 ఏళ్ల తర్వాత ఇంటికి చేరాడు జగిత్యాల జిల్లా మల్యాల మండలం మానాల గ్రామానికి చెందిన శివరాత్రి హనుమంతు. గ్రామానికి చెందిన శివరాత్రి హనుమంతుకు బుగ్గారం మండలం గోపులాపురానికి చెందిన పద్మతో 20ఏళ్ల క్రితం వివాహమైంది. పెళ్లైన ఏడాదికే ఉపాధి కోసం హనుమంతు దుబాయ్ వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాడు. పాప పుట్టిన తర్వాత పురుడు చేసిన మరునాడే దుబాయ్ వెళ్లాడు. మూడు నెలలకే హత్య కేసులో జైలుకెళ్లాడు. అప్పటి నుంచి ఆయన భార్య పద్మ భర్త కోసం ఎదురుచూస్తూనే ఉంది. ఆమె 18ఏళ్ల నిరీక్షణ ఫలించాయి. దుబాయ్ జైలు నుంచి విడుదలై ఇంటికి చేరిన భర్త హనుమంతును చూసి కడుపులో దాచుకున్న దుఃఖం కట్టలు తెంచుకుంది. 'మాది రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద వడ్డెర కుటుంబం. ఉపాధి కోసం ఆయన (హనుమంతు) దుబాయ్ పోయిండు. అక్కడ జైలులో పడ్డడు. పద్దెనిమిదేళ్లుగా భర్త కోసం ఎదురుచూసిన. నా ఐదుగురు అన్నలు, ఇద్దరు తమ్ముళ్ల సహకారంతో తల్లిగారింట్లో ఉంటూ.. బీడీలు చేస్తూ, వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ కాలం వెళ్లదీసిన. మూడు, నాలుగు నెలలకు ఒకసారి భర్తతో ఫోన్‌లో మాట్లాడిన. భర్తను తలుచుకుని ఏడుస్తూ నిద్రలేని రాత్రులు గడిపిన. కూతురు గౌతమిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన. హనుమంతును ఇంటికి రప్పించేందుకు కేటీఆర్ సారును కలిసినం. కేటీఆర్ సారు కడుపు సల్లగుండ ఆయన చేసిన మేలుతో దుబాయ్ జైలు నుంచి నా భర్త బయటపడి ఇంటికి చేరిండు. ఆయన చేసిన మేలు జీవితకాలం మరిచిపోను..' అని తన భర్త జైలు నుండి విడుదల కోసం కృషి చేసిన మాజీ మంత్రి కేటీఆర్‌కు హనుమంతు భార్య పద్మ కృతజ్ఞతలు తెలిపింది.

తరలివచ్చి.. మొక్కులు చెల్లించి





వేములవాడ: రాజన్న సన్నిధి రద్దీతో కిటకిటలాడింది. సమ్మక్క జాతర సమీపిస్తుండటంతో స్వామివారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆదివారం 40 వేల మంది రాజన్నను దర్శించుకున్నారు. దీంతో రూ.అరకోటి ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 20న హుండీ లెక్కింపు గత రెండునెలలుగా అశేషంగా తరలివస్తున్న భక్తులతో రాజన్న హుండీలు నిండిపోతున్నాయి. ఇటీవలే హుండీలు లెక్కిస్తే గతంలో ఏనాడు లేనివిధంగా ఆదాయం రూ.రెండున్నర కోట్లు సమకూరింది. మళ్లీ హుండీలు నిండిపోవడంతో ఈనెల 20న హుండీ ఆదాయం లెక్కించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో జరిగే హుండీ లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఈవో కృష్ణప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.